నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

గణన గందరగోళం

గద్వాల, ఫిబ్రవరి 6 : కులగణన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వే నివేదిక తప్పుల తడకగా ఉందని బీసీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరైన సర్వే చేయకుండా బీసీలను తక్కువ చేసి చూపిస్తున్నారని మండి పడుతున్నారు. ఏడాది ఏడాదికి జనాభా పెరుగుతూ ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తప్పుడు లెక్కలు చెబుతూ తక్కువ చేసి చూయించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కటుంబ సర్వేతో పోల్చితే 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కుల గణన సర్వేలో బీసీల జనాభా తగ్గించడమే కాకుండా ఓసీ జనాభా పెరిగినట్లు కుట్ర పూరితంగా తప్పుడు లెక్కలు కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వేను తక్షణమే రద్దు చేసి మళ్లీ పూర్తి స్థాయిలో సర్వేను నిర్వహిస్తే తప్పా బీసీలకు న్యాయం దక్కదన్నారు.



- పూర్తి స్థాయిలో కొనసాగని ప్రక్రియ
- బీసీ నేతల్లో ఆందోళన
- ఆశలపై నీళ్లు చల్లారని పలువురి ఆగ్రహం
- డిక్లరేషన్ అమలు చేస్తారా..? లేదా..?
- 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్
- లేదంటే పోరాటాలకు సిద్ధమవ్వాలని బీసీ మేధావుల పిలుపు

తప్పుల తడకగా సర్వే వివరాలు

రీ సర్వే చేయాలి

బీసీలను అవమానపర్చేలా ఉన్న ఈ కులగణనను రీ సర్వే చేయాలి. బీహార్ రాష్ట్రంలో కులగణ చేస్తే అక్కడ ముఖ్యమంత్రి 26 సార్లు సమీక్ష సమావేశాలు చేస్తే ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క సమావేశం నిర్వహించడం అన్యాయం. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికల నిర్వహిస్తామని చెప్పి ఆనాడు బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి సంవత్సరం పాటు ఎదురు చూసిన బీసీల ఆశలపై నీళ్లు చల్లారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై సీఎం సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు గ్రామ గ్రామానా బీసీలకు జరిగిన అన్యాయం, అవమానాలపై, ఈడబ్ల్యూఎస్‌తో జరుగుతున్న అన్యాయంపై కూడా పోరాటాలకు సిద్ధమవుతున్నాం.

- శ్రీనివాస్‌సాగర్
బీసీ సమాజ్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు పాలమూరు

సర్వే కాకి లెక్కలు..

రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే తప్పుల తడకగా, కాకి లెక్కలతో అశాస్త్రీయంగా చేసింది. పదేండ్లలో తెలంగాణ జనాభా 2లక్షలు మాత్రమే పెరిగిందని పేర్కొనడం విడ్డూరంగా ఉంది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014లో జరిపించిన సమగ్ర సర్వేలో బీసీ(ముస్లింలోని బీసీలు కాకుండా) 52శాతం అని నిర్ధారణ కాగా, ఇప్పుడు 46శాతమేనని 6శాతం తగ్గించి చూపడం దారుణం. బీసీల జనాభాను తగ్గించి చూపడమే కాక మంత్రిమండలి ఆమోదించడం, చట్టసభల్లో ప్రవేశపెట్టి ప్రజలకు తప్పుడు సమాచారమిచ్చి ప్రజాస్వామ్యాన్ని ఆపహాస్యం చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసే ఉద్దేశ్యం ఈ ప్రభుత్వానికి ఏ కోశాన లేదు. బీసీలపై కాంగ్రెస్‌కు చులకన భావం నెల కొన్నది. ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలి. బీసీలకు అన్యాయం జరిగితే చూస్తు ఊరుకోం.

- బాసు హన్మంతు నాయుడు, బీఆర్ఎస్ నేత

బీసీలను మోసం చేసేలా కాంగ్రెస్ కుట్ర

కాంగ్రెస్ ప్రభుత్వం ఓ పథకం ప్రకారం బీసీలను అణగదొక్కేందుకే కుల గణన చేపట్టింది. శాస్త్రీయంగా లేని ఈ సర్వేలో అవసరం లేని 59 అంశాల గురించి ప్రస్తావించిందే తప్పితే బీసీలకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం సర్వేలో కానరాలేదు. ఇప్పటి వరకు విద్య, ఉద్యోగ రంగాల్లో అమలవుతున్న బీసీ రిజర్వేషన్లను, పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను రద్దు చేసే కుట్రలో భాగంగానే ఈ సర్కారు సర్వే నిర్వహించింది. సర్వేను బీసీ సంఘాలు, కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బీసీలకు న్యాయం జరగాలంటే రాజకీయ ఉద్యమం అవసరం. ఇప్పటికైనా బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకం కావాల్సిన అవసరముంది. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తేనే బడుగు బలహీన వర్గాలకు సరైన న్యాయం జరుగుతుంది. అలాగే, చట్టసభల్లోనూ రిజర్వేషన్లు కల్పించి అమలు చేయాలి.

- ఏబీజే సత్యంసాగర్, సామాజికవేత్త, పెబ్బేరు



కాంగ్రెస్ నాయకులకు కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయాం

- బీఆర్ఎస్‌లో చేరిన ఏదుల మండల నాయకులు
- గులాబీ పార్టీ కండువాలు కప్పిన సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోయాయని, అభివృద్ధికి బాటలు వేసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వెంట ఉంటామని బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఏదుల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏదుల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శేషిరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేశ్, రాజు, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరి కొందరు ఏదుల బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో గురువారం వనపర్తి పట్టణంలోని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషి తో ఏదులను నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేసి, పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. అదేవిధంగా ఏదుల రిజర్వాయర్‌ను ఏర్పాటు చేయించి అభివృద్ధికి మారు పేరుగా ఆయన నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ సర్పంచ్ సునీల్‌కుమార్, రమేశ్, మాజీ ఎంపీటీసీ స్వామిరెడ్డి, నాయకులు నందిమల్ల అశోక్, శంకర్‌రెడ్డి, రమేశ్, శేషయ్య, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు..

గట్టు, ఫిబ్రవరి 6 : తక్కువ పెట్టుబడితో ఆయిల్ పాం సాగు చేసి అధిక లాభాలు సాధించుచున్నని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు సోదరుడి వివాహం సందర్భంగా గురువారం బలిగేరకు వచ్చారు. అనంతరం అయిజకు వెళ్తూ మార్గమధ్యలో మిట్టదొడ్డి వద్ద రైతు నర్సింహారెడ్డి ఆయిల్‌పాం తోటను పరిశీలించారు. తక్కువ వ్యవధిలో ఆయిల్‌పాం ఆశించిన స్థాయి కంటే ఎక్కువ ఎదుగుదలను గమనించి మాజీ మంత్రి పంటను సాగు చేసిన విధానాన్ని రైతు నుంచి తెలుసుకొని అభినందించారు. మొత్తంగా రైతు 50 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేస్తున్నాడని తెలుసుకొని ఆశ్చర్య పోయారు. పంట చేతికొచ్చే సమయంలో చెట్లకు నీటిని సమృద్ధిగా అందించాలని రైతుకు సూచించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డిని ఆదర్శంగా తీసుకొని మిగతా రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఎప్పటికప్పుడు రైతులు అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వ పల్లయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, భద్రయ్య, వేమారెడ్డి, జమాలుద్దీన్, వీరేశ్, మత్తాలి, నేష వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

- ఆరు గ్యారెంటీలు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం
- 13న ఆమనగల్లులో రైతు దీక్ష
- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాక ముందు కామారెడ్డి ఇచ్చిన డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేసి తమ చిత్త శుద్ధిని నిరూపించుకోవాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గం లోని మున్సిపాలిటీ వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలతో ఈ నెల13న ఆమనగల్లు పట్టణంలో నిర్వహించనున్న రైతుదీక్షకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 420 రోజులు గడిచినా ఆరు గ్యారెంటీలు సమర్థవంతంగా అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అనతికాలంలోనే ఇచ్చిన హామీల తోపాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసిందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి కొన్ని పథకాలు అధికారంలోకి వచ్చిన వెంటనే మరి కొన్ని పథకాలు వంద రోజులలో అమలుచేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసాలను అందిస్తామని చెప్పి చెల్లించకుండా రైతులను నట్టేటా ముంచారన్నారు. పాడిరైతులకు ప్రతి పదిహేను రోజులకు ఒక సారి చెల్లించే పాలబిల్లులను సకాలంలో చెల్లించకుండా ప్రతి లీటర్‌కు రూ.ఆరున్నర తగ్గించి ఐదు పాలబిల్లులు పెండింగ్‌లో ఉంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వే ఏమాత్రం పారదర్శకంగా లేదని 52 శాతానికి పైగా ఉన్న బీసీ శాతాన్ని 46 శాతానికి తగ్గించడం సరైంది కాదన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీని గద్దె దింపేవరకు పోరాడుతామన్నారు. రైతులను మోసం చేసి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నందున వారికి మద్దతుగా ఆమనగల్లులో ఈ నెల 13న భారీ ఎత్తున రైతు దీక్ష నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని వెల్లడించారు. కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, రైతులు, ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మసత్యం మిషన్‌భగీరథ మాజీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి, మాజీవైస్ ఎంపీపీ గోవర్ధన్, పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు బావండ్ల మధు, గణేశ్, పరశురాములు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పనుల పేరుతో.. ఇసుక అక్రమ రవాణా

టిప్పర్లలో ఇసుకను అక్రంగా తరలిస్తున్న దృశ్యం

వంగూరు, ఫిబ్రవరి 6 : ఇసుక తరలింపునకు అనుమతులు లేవు. కేవలం అధికార పార్టీ నెపంతో కొందరు ప్రభుత్వ పనుల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తుడడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. మండలంలోని ఉల్పర గ్రామ సమీపంలోని దుంధుభీ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళలో టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారు. దీంతో గురువారం తెల్లవారుజామున గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో ఇసుక మాఫియా గ్రామస్తులకు ఫోన్‌చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. అయినా గ్రామస్తులు భయపడకుండా వాటిని అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరిస్థితి చెయి దాటుతుందనుకున్న అధికార పార్టీ నేతలు సైతం పోలీసులతో ఏం మాట్లాడారో తెలియదు కానీ ఎస్సై మహేందర్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకొని గ్రామస్తులకు సర్ధిచెప్పారు. కొద్దిసేపు వారు ఎస్సైతో వాగ్వాదానికి దిగారు. అనుమతులు ఉన్నా టిప్పర్లను నేరుగా వాగులోకి అనుమతించేది లేదంటూ అవసరమైతే గ్రామస్తులే ట్రాక్టర్ల ద్వారా డంప్ చేస్తామని అక్కడి నుంచి తరలించే ఏర్పాటు చేసుకోవాలని పోలీసులకు సూచించారు. దీంతో ఎస్సై మహేందర్ గ్రామస్తులకు సర్ధిచెప్పి ప్రభుత్వ పనుల కోసం మాత్రమే తీసుకెళ్తున్నారని, మరో సారి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

నష్టపరిహారం చెల్లించాలి

- భారత్‌మాల భూ నిర్వాసితుల డిమాండ్
- నేషనల్ హైవే అథారిటీ కార్యాలయం

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 6 : భారత్ మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. నారాయణపేట్ జిల్లాలోని మూడు మండలాలకు చేందిన భూ నిర్వాసితులు గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారుల కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని 3 గంటలపాటు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుడు రామలింగం మాట్లాడుతూ ఆ రేండ్ల కిందట 19 గ్రామాల నుంచి 3 వేల మందితో భూమి సేకరించి ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. మా భూములు మాకు ఇవ్వాలని డిమాండ్ చేస్తే నేషనల్ హైవే అధికారులు కేసులు వేసి రెండేళ్లు నష్టపరిహారం నిలివేశారని వాపోయారు. బాధితులు కోర్టును ఆశ్రయించగా కేసును కొట్టేసిందన్నారు. రెండేళ్ల కిందట నారాయణపేట్ కలెక్టర్ అవార్డును ఆమోదించగా.. ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్లక్ష్యం వల్ల తమకు రావలసిన అవార్డు నిలిచిపోయాయని మండిపడ్డారు. అవార్డులపై ఆఫీసర్లు తప్పుడు కేసు వేసి రెండేళ్లు కాలయాపన చేయడంతో మేము నష్టపోయామని అందుకు ప్రస్తుతం ఉన్న భూమిరేటు ప్రకారమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 2019న తమ భూములను పీవో టీవో ఉంచడంతో అమ్ముకోలేక, మార్ట్‌గేజ్ చేయలేక ఆర్థిక ఇబ్బందులతో దాదాపు 8మంది బాధితులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన భూ బాధిత కుటుంబాలను ప్రభుత్వమే అదుకోవాలని, రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన గుడులు, మసీదులు, చర్చిలను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసుల సహకారంతో ప్రాజెక్ట్ డైరెక్టర్ హిమాన్షుగుప్తా బయటకు వచ్చి మీకు త్వరలోనే అవార్డు అందుతుందని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నష్టపరిహారం విషయంలో ఆరేండ్లుగా ఇదే మాట చెబుతున్నారని, స్పష్టంగా ఎప్పుడు ఇస్తారో చెప్పాలని పట్టుబట్టారు. దీంతో పీడీ నెలరోజుల్లో పరిహారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, ప్రసాద్, గోవర్ధన్‌గౌడ్, రవి, వెంకటేశ్, ఉదయ్‌కుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిస్తాహౌస్ చౌరస్తా నుంచి ర్యాలీగా వస్తున్న నిర్వాసితులు

నేషనల్ హైవే కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నిర్వసితులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 సెంటర్లు ఏర్పాటు
- హాజరు కానున్న 5,016 మంది విద్యార్థులు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 6 : బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న 9,11వ తరగతుల ప్రవేశాల కోసం ఈనెల 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షకు 5,016 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. 9వ తరగతికి సంబంధించి 6 సెంటర్లలో 1,704 మంది విద్యార్థులు, 11వ తరగతి ప్రవేశానికి సంబంధించి 14 సెంటర్లలో 1,647 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా సెంటర్ సూపరింటెండెంట్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సీబీఎస్ఈ ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు నుంచి హాజరయ్యే విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షను నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, వట్టెం నవోదయ పాఠశాలలో మొత్తం 20 సెంటర్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కార్యక్రమంలో డీఈవో రమేశ్, పరీక్షల ఇన్‌చార్జి భాస్కరాచారి, జిల్లా పరీక్షల అదనపు కమిషనర్ రాజశేఖర్ రాపు ఉన్నారు.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

- బాలాన గర్ బాలికల పాఠశాలలో ఘటన
- బాలిక కుటుంబానికి న్యాయం చేస్తామన్న కలెక్టర్ విజయేందిర బోయి
- కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని ఎస్పీ ఆదేశం

రోధిస్తున్న ఆరాధ్య తల్లి

బాలానగర్, ఫిబ్రవరి 6 : పదో తరగతి విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం ఉదయం బాలానగర్ బాలికల గురుకులంలో చోటు చేసుకున్నది. గురుకులం అధ్యాపకుల కథనం ప్రకారం.. నాగరకర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కన్నపల్లికి చెందిన ఆరాధ్య (15)తెల్లవారు జామున 5:30 గంటల వరకు స్టడీ అవర్‌లో తోటి విద్యార్థులతో కలిసి చదువుకున్నది. అనంతరం విద్యార్థులంతా స్నానాలకు వెళ్తుండగా తానూ బకెట్ తీసుకొని స్నానానికి వెళ్లింది. బకెట్‌ను బాత్రూం బయటే వదిలేసి ఆ సమీపంలో ఉన్న ఓ చీర తీసుకొని ఏడో తరగతి గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుంది. పుస్తకాల కోసం తరగతి గదిలోకి వెళ్లిన విద్యార్థులు గమనించి ప్రిన్సిపాల్ అంజన్‌రెడ్డి, ఇతర అధ్యాపకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు బాలికను షాద్‌నగర్ దవాఖానకు తరలించగా అప్పటికే ఆ విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలిక ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి గురుకులం గేటు ఎదుట ఆందోళనకు పూనుకొని విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో గురుకులం ఆవరణంతా గందరగోళంగా మారింది. పరిస్థితి చేయిదాటిపోతుడడంతో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు నాగార్జున గౌడ్, ఆదిరెడ్డి, జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్, మిడ్జిల్ మండలాలకు చెందిన ఎస్సైలు, పోలీసులతో గురుకులం వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, డీఈవో ప్రవీణ్‌కుమార్ తదితరులు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో గురుకులానికి చేరుకొని బాలిక తల్లిదండ్రులు రమేశ్, రజితలతో పాటు, గురుకులం అధ్యాపకులు, విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడారు. తమకు న్యాయం చేయాలంటూ బాలిక తల్లిదండ్రులు కలెక్టర్ విజయేందిర ముందు విలపించారు. గురుకులంలోని అధ్యాపకుల కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. బాలిక ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, బాలిక కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని బాలిక తరపు బంధువులు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, ఔట్‌సోర్సింగ్‌లో బాలిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఎస్పీ జానకి పోలీసులను ఆదేశించారు.

ఆరాధ్య (ఫైల్)

మృతికి కారణమైన వారిని శిక్షించాలి

బాలానగర్ బాలికల గురుకులంలో పదో తరగతి చదువుతున్న తమ కుమార్తె ఆరాధ్య (15) మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బాలిక తండ్రి నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కన్నపల్లికి చెందిన రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం 8:15 గంటల ప్రాంతంలో గురుకులం అధ్యాపకురాలు అనిత ఫోన్‌చేసి మీ కుమార్తెకు ఫిట్స్ వచ్చింది వెంటనే రమ్మని చెప్పిందని, 9:30కు మరో అధ్యాపకురాలు ఫోన్‌చేసి మీ కుమార్తె చనిపోయిందని చెప్పారని, ఉదయం 11గంటలకు షాద్‌నగర్ దవాఖానలో ఆరాధ్య మృతదేహాన్ని పరీక్షించగా చేతులపై, కాళ్లపై కమిలిన గాయాలున్నాయని పేర్కొన్నారు. ఇటీవల సంక్రాంతి సెలవులకు వచ్చినప్పుడు ప్రిన్సిపాల్ అంజన్‌రెడ్డి, అధ్యాపకురాలు అనిత తనను వేధిస్తున్నారని చెప్పిందని, వారి వేధింపుల కారణంగానే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

కల్లు సీసాలో ఎలుక

కల్లు సీసాలో ఉన్న ఎలుక

బిజినేపల్లి, ఫిబ్రవరి 6: కల్లు సీసాలో ఎలుక కలకలం రేపిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. బిజినేపల్లి మండలం గుడ్లనర్వ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గురువారం తన ఇంట్లో శుభకార్యం ఉండగా స్థానికంగా ఉన్న కల్లు దుకాణంలో ఒక కేసు కల్లు తీసుకెళ్లాడు. కల్లు సీసాలను బంధువులకు ఇవ్వడంతో పాటు తాను కూడా సేవించే క్రమంలో సీసాలోంచి చనిపోయిన ఎలుక పిల్ల వచ్చింది. దీంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. గమనించిన స్థానికులు కల్లు దుకాణం వద్దకు వెళ్లి యజమానిని నిలదీశారు. దీంతో బిత్తరపోయిన యజమాని సమాధానం చెప్పకుండా ముఖం చాటేశాడు. ఈ సంఘటన సోషల్ మీడియాలో దావానంలా వ్యాపించడంతో స్పందించిన ఎక్సైజ్ అధికారులు గ్రామానికి చేరుకొని కల్లు శాంపిళ్లను సేకరించారు. పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించినట్లు ఎక్సైజ్ సీఐ కళ్యాణ్ తెలిపారు.